

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నియోజకవర్గాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తా

గాజులరామారం, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ షిరిడీ హిల్స్‌లో రూ. 49.50 లక్షలు, ఎండమూరి ద్వారకానగర్ ఫేజ్-1 కాలనీలో రూ. 39 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు నాయకులు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దేవేందర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులైన 372 మందికి అధికారులతో ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఫాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్‌రామిరెడ్డి, నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఎత్తరి మారయ్య, చెట్ల వెంకటేష్, మసూద్, మూసాఖాన్, అజీద్, నవాబ్‌భాయి, తారాసింగ్, మహిళా అధ్యక్షురాలు సంధ్య, పార్వతి, ఊర్మిల, దుర్గ పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో..

గాజులరామారం డివిజన్‌లోని నెహ్రూనగర్‌కు చెందిన సోమిరెడ్డి కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకవెళ్లారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించిన మంజూరైన రూ. 1,10,000 లు చెక్కును బాధితుడికి అందజేశారు.

హైడ్రా ఓ పెద్ద హైడ్రామా: ఎమ్మెల్యే మాధవరం



మాట్లాడుతున్న కృష్ణారావు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): హైడ్రా చర్యలతో మధ్య తరగతి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నల్లచెరువులో ఆదివారం హైడ్రా కూల్చివేతలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం, ఆదివారం వస్తుందంటే హైదరాబాద్‌లో ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. హైడ్రా కూల్చివేతలు చేశాక నిర్మాణ వ్యర్థాలు తీసివేయకుండా, చెత్తను జమ చేస్తున్నారని, వాటిని తీయకుండా చెరువును ఏవిధంగా కాపాడుతారని ప్రశ్నించారు. నల్లచెరువులో కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టాదారులకు చెందిందని, పట్టాదారులకు ఏ విధమైన న్యాయం చేయనున్నారని చెరువులలో పట్టాలు ఉన్న వారికి నష్టపరిహారం చెల్లించి ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకొని చెరువులను కాపాడుతూ అభివృద్ధి చేయాలని సూచించారు. కూల్చివేతలతో నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు.



మాధవినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మాధవినగర్ సమస్యల పరిష్కారానికి కృషి

హైదర్‌నగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నామని, పెండింగ్ పనులు కూడా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మాధవినగర్ కాలనీలోని సమస్యలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర సోమవారం చేశారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతులు కల్పించినందుకు స్థానికులకు గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్డు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపరచాలని ఎమ్మెల్యేనుకోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్, డీఈ రమేష్, ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు మహాదేవ్, రవి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, గణేశ్, కాశీనాథ్‌యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసినగర్, ధరణినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, బూత్ స్థాయిలో పార్టీ సీనియర్ నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి బూత్‌లోను 300లకు తగ్గకుండా సభ్యత్వ నమోదులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురభి రవీందర్‌రావు, కమలాకర్‌రెడ్డి, రామరాజు, నరసింహచారి, కుమార్‌యాదవ్, రామ్‌రెడ్డి, శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, చారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. 26 ఫిర్యాదులు అందగా.. అందులో 20 టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవేనని అధికారులు తెలిపారు. ఆయా సర్కిల్స్ కార్యాలయాల్లో పరిష్కారం కాకుండా ఉన్నవాటిపైనే ఎక్కువగా మళ్లీమళ్లీ ఫిర్యాదులు అందుతున్నా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ప్రతీ నెలా ఫిర్యాదులు చేస్తున్నా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఫిర్యాదుదారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇక కూకట్‌పల్లి సర్కిల్‌కు ఎనిమిది, మూసాపేట్ సర్కిల్‌కు మూడు ఫిర్యాదులు అందినట్లు డిప్యూటీ కమిషనర్లు కృష్ణయ్య, రమేష్ తెలిపారు.



గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీలో గర్భిణులకు శ్రీమంతం

బాలానగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళకు మాతృత్వం ఒక వరమని, వివాహం అయిన తరువాత అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంత ఆరాటపడతారో, ఆశపడతారో అది మహిళలకు మాత్రమే తెలుసునని హస్మత్‌పేట్ సెక్టార్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. సోమవారం ఉదయం బాలానగర్ రాజూకాలనీ కమ్యూనిటీహాలులో బాలానగర్‌కు చెందిన 13 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి వారికి పోషకాహారంపై అవగాహన కల్పించారు. 3-6 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ అందుబాటులో ఉందని దీనిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

బాలానగర్: కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాలానగర్‌కు చెందిన మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కొండకింది పుష్పారెడ్డి సోమవారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌తో కలిసి కమిటీ సభ్యులను వెంటబెట్టుకుని నరేందర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో ఆమె అభిమానులు, కార్యకర్తలు తదితరులు ఆమె వెంట ఉన్నారు.



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన బండి రమేష్ తదితరులు

డబ్బులిస్తే అక్రమ భవనాలను సీజ్ చేయం

- సీజ్ చేసిన భవనాలన్నీ పూర్తి కావస్తున్నాయ్..
- మీకు మేమున్నాం అంటూ టీపీఎస్‌ల భరోసా!
- జడ్సీ కంట పడకుండా టౌన్‌ప్లానింగ్ అధికారుల జాగ్రత్తలు



ఎల్‌ఐజీ ప్లాట్ నంబర్-81ను ఆగస్టు 14న సీజ్ చేసినప్పుడు..



ఎల్‌ఐజీ ప్లాట్ నంబర్-81 సెప్టెంబర్ 23న పరిస్థితి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): 'నవ్విపోదురుగాక మాకేంటి? మేం అడిగినంత ఇస్తే మీ భవనాలు సీజ్ కాదు కదా.. కనీసం నోటీసులు కూడా రాకుండా చూస్తాం? మీ బిల్డింగ్ పనులు త్వరగా పూర్తి చేసుకుంటారా? లేక నోటీసులు, సీజ్ చేసిన తర్వాత మా చుట్టూ తిరుగుతారా. మీ ఇష్టం' అంటూ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో భవన నిర్మాణదారులతో టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్) బేరాలాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సర్కిళ్ల పరిధిలో ఎంత మంది భవన నిర్మాణదారులకు నోటీసులు వచ్చాయి.. ఎన్ని భవనాలు సీజ్ చేశాం.. ఆ తర్వాత వాటి పరిస్థితి తెలుసా? అంటూ నిర్మాణదారులను భయభ్రాంతులకు గురిచేసి అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.

● కైత్లాపూర్ మెయిన్‌రోడ్డులో కేపీహెచ్‌బీ 15వ ఫేజ్.. ప్లాట్ నంబర్-81ను ఆగస్టు 14న సీజ్ చేశారు. కానీ అన్ని పనులు పూర్తిచేసుకొని నేడు ఆ భవనం వ్యాపార కార్యకలాపాలను కొనసాగించడానికి సిద్ధంగా ఉంది. సీల్ అలానే ఉంచి పనులన్నీ చక్కబెట్టారు. కానీ ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

● కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-2లో 111 గజాల్లో నిర్మాణదారుడు ఆరు ఫ్లోర్లు నిర్మించాడు. ఆ భవనాన్ని సీజ్ చేయాల్సి ఉన్నా నోటీసులు జారీ కాకుండా టౌన్‌ప్లానింగ్ అధికారి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో భవనాలు నిర్మాణం చేసుకునేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం ఏం చేస్తోంది

కూకట్‌పల్లి జోన్ పరిధిలో జడ్సీ పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాలను గుర్తించడం, నోటీసులు ఇవ్వడం, కూలగొట్టడం, సీజ్ చేయడం, కేసులు బుక్ చేయడం ఓసం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం పనిచేస్తోంది. నోడల్ ఆఫీసర్‌గా మూసాపేట్ సర్కిల్ డీసీ రమేష్ వ్యవహరిస్తుండగా.. మరో ఇద్దరు డీఈఈలు ఉన్నారు. వీరికి తోడు ఒక్కో జీహెచ్‌ఎంసీ వార్డుకు ఇద్దరు చొప్పున న్యాక్ ఇంజనీర్లను నియమించుకొని వాటి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించి ఎస్‌టీఎఫ్‌కు తెలియజేయాలి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన టీపీఎస్ మేమున్నాం మీరు పని చేసుకోండి.. కానీ మేము అడిగినంత ఇచ్చుకుంటేనే..' అని మెలికపెడుతూ అందినకాడికి దండుకుంటున్నారని నిర్మాణదారులు చర్చించుకుంటున్నారు.

జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ ఆఫీసర్ అపూర్వ్ చౌహాన్ ఉన్నా ఆయన కంటపడకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసుకుంటున్నారట. దీంతో 100 గజాల్లోపు ఆరు అంతస్తులు యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకునేనాథుడే కరవయ్యారు. వసంతనగర్‌లో 125 గజాల్లో ఏడు ఫ్లోరు వేయడం అక్కడి కాలనీవాసులతో పాటు సొసైటీ సభ్యులను విస్మయానికి గురిచేసింది.



బాలానగర్ ఎక్స్ రోడ్డు వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ

బాలానగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ వారికి అనుకూలంగా చట్టాలను రూపొందిస్తోందని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బ్లాక్‌డే సందర్భంగా బాలానగర్ ఎక్స్ రోడ్డులో కార్మిక నాయకులు, కార్మికులంతా కలిసి ప్లకార్డులతో నిరసన ప్రదర్శించారు, ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు సుదర్శన్, సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను రద్దు చేసి కొత్తగా 4 లేబర్ కోడ్‌లను అమలు లోకి తెచ్చి కార్మికుల గొంతు కోస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు యాజమాన్యాలు కార్మికులను దోచుకునే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కష్టాలను అర్థం చేసుకుని లేబర్ కోడ్‌ను రద్దు చేసి కార్మికులకు రూ.26,000 కనీస వేతనాన్ని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అమిత్ కెపాసిటర్స్ కార్యదర్శి మల్లేష్, కార్మికులు లక్ష్మి, నవనీత, సుగుణ, సబితా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి కేవీపీఎస్ కార్యవర్గం ఎన్నిక

చందానగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ కార్యవర్గం ఎన్నుకున్నారు. చందానగర్ పీజేఆర్ స్టేడియం ఆవరణలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో వెళ్లాలని తీర్మానం చేశారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ కేవీపీఎస్ అధ్యక్షుడిగా సత్యం, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజు, సి.రాజు, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, నరేష్, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

2వ రోజు ఖో ఖో పోటీలు

దుండిగల్: బాచుపల్లి వీఎస్‌ఆర్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖో-ఖో టోర్నమెంట్ అండర్-14, 17, 19 వర్గాల్లో బాలురు, బాలికల పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

మరుగుదొడ్ల మాటున అక్రమార్జన



మాట్లాడుతున్న శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, అనిల్

పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన లూ కేఫే ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు లూ కేఫే నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లికి చెందిన శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, లూ కేఫే నిర్వాహకులు అనిల్, భరత్‌లు వివరాలు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులలో ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్లు పిలవగా బీహార్‌కు చెందిన ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత అభిషేక్ నాథ్ అప్పటి ప్రభుత్వ పెద్దలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ల సహకారంతో కాంట్రాక్టు దక్కించుకున్నాడని అన్నారు. శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో డివిజన్‌కు 13 చొప్పు న సుమారు వందకు పైగా లూ కేఫేలను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిందని, వాటిని నిర్వహణ చూస్తామని చెప్పి ఒక్కో లూ కేఫేను ఇరవై వేల రూపాయలు నుంచి లక్ష రూపాయల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని నెలకు ఎనిమిది నుంచి పది వేలకు పైగా చెల్లించే విధంగా వేరే వారికి కట్టబెట్టారని అన్నారు. ఒక్కో కేఫేకు జీహెచ్‌ఎంసీకి సంవత్సరానికి కేవలం రూ.1385 రూపాయలు మాత్రమే కడుతూ తమ వద్ద నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నాడని, ఈ విధంగా అతను నెలకు కోటి రూపాయల వరకు సంపాదిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి అతని సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి తమకే వాటి నిర్వహణ అప్పగించాలని అన్నారు.

యాడ్స్‌తో ఆదాయం

లూ కేఫేల చుట్టూ యాడ్స్ ప్రదర్శిస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఒక్కో కేఫేకు సుమారు 3.40 లక్షల రూపాయలను జీహెచ్‌ఎంసీ వెచ్చించిందని అన్నారు. లూ కేఫేల నిర్వహణ, తదితర వాటిపై విచారణ జరిపించాలని, గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన అప్పటి సీఎస్, మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించామని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అన్నారు.

పబ్‌లో ఐపీఎస్ అధికారి భార్యకు వేధింపులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పబ్‌కు వెళ్లిన ఐపీఎస్ అధికారి భార్యను ఓ వైద్యుడు వేధించాడు. పబ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు వైద్యుడిపై కేసు నమోదు చేశారు. నగరంలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి తన భార్యతో కలిసి ఈనెల 21న గచ్చిబౌలిలోని తబులా పబ్‌కు వెళ్లారు. పబ్‌లో ఐపీఎస్ అధికారి భార్యతో మియాపూర్‌కు చెందిన హన్మంత్ రెడ్డి (51) అనే వైద్యుడు అనుచితంగా ప్రవర్తించాడు. పబ్ మేనేజర్ సాయి చైతన్య ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు.

పంజాబ్ నుంచి నగరానికి గంజాయి చాక్లెట్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అధిక సంపాదన కోసం పంజాబ్ నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్న పాత నేరస్తుడిని మాదాపూర్ ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.02 లక్షల విలువైన గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం పంజాబ్‌కు చెందిన తమ్మిస్కార్ సింగ్(55) కుటుంబం కొంతకాలం క్రితం వలస వచ్చి సూర్యాపేటలో స్థిరపడ్డారు. తమ్మిస్కార్ సింగ్ 1 0ఏళ్ల క్రితం గాజులరామారం ప్రాంతానికి వచ్చాడు. గృహోపకరణాలు తయారు చేస్తూ విక్రయించేవాడు. చెడు వ్యసనాలకు బానిసైన తమ్మిస్కార్ సింగ్ ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. రెండుసార్లు అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా తీరు మార్చుకోకుండా గంజాయి చాక్లెట్ల విక్రయం ప్రారంభించాడు. పంజాబ్ రాణీపూర్ జిల్లా ఆనంద్‌పూర్ సాహిబ్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేస్తున్నాడు. ఒక్కో గంజాయి చాక్లెట్ రూ.40 చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ విషయం గురించి పక్కా సమాచారంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు వలపన్ని అరెస్ట్ చేశారు. అతడి నుంచి 12.7 కేజీల గంజాయి చాక్లెట్స్, 680 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు.

రామిరెడ్డినగర్‌లో ఏడుగురి అరెస్ట్

జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతం రామిరెడ్డినగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని, గంజాయి తాగుతున్న ఆరుగురిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 850 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ షేక్ అలీ(26) డ్రైవర్. రామిరెడ్డినగర్‌లో నివాసముంటున్నాడు. మహారాష్ట్రాలోని నాగపూర్ నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడు. సోమవారం సేవిస్తున్న మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాల నూతన భవనానికి కృషి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గిరినగర్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని పాఠశాల ఉపాధ్యాయులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సోమవారం కలిశారు. పదేళ్ల నుంచి ఫిర్యాదు చేసినా, గత ప్రభుత్వం పట్టించుకోలేదని, పైకప్పు నుంచి వర్షం నీరు కారుతుందని ఆయనకు వివరించారు. మండల అధికారులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, నూతన భవన నిర్మాణం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు అఫ్జల్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్యామల, యూత్ నాయకులు ఎం శ్రీనివాస్, సాయికుమార్, వసుందర పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన జనసేన

చందానగర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు జనసేన పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి మాధవరెడ్డి అన్నారు. జనసేన నాయకులు సోమవారం చందానగర్ మంజీర రోడ్డులో ఏర్పడిన గుంతలను స్వచ్ఛందంగా గంగారం సుభాష్‌నగర్ వరకు గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు స్పీకర్ బాక్స్ అందజేత

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం క్షత్రియ సంఘం నాయకులు రూ.8వేలు విలువ చేసే వైర్‌లెస్ స్పీకర్ బాక్స్ సెట్‌ను అందజేశారు. ఇది విద్యార్థులకు అనౌన్స్‌మెంట్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతరత్రా వేడుకల సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు ఎస్వీ ఆర్ కల్యాణ్ వర్మ, రామరాజు, పండు, శ్రీను, కృష్ణం రాజు, లక్ష్మీపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

బేబీ ఫీడింగ్ రూం ప్రారంభం



బేబీ ఫీడింగ్ రూం ప్రారంభం అనంతరం ఉద్యోగులతో జడ్సీ అపూర్వ్ చౌహాన్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ రూంను సోమవారం జడ్సీ అపూర్వ్ చౌహాన్ సోమవారం ప్రారంభించారు. జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే మహిళలకు వారి పిల్లలకు పాలు ఇవ్వడం, పౌష్టికాహారం అందించడం, డైపర్లు మార్చుకోవడం కోసం ఇది దోహదపడుతుందన్నారు. డీఈఈ శ్రీదేవి, జోన్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఈ రంజిత్ పాల్గొన్నారు.

28న ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర సమావేశం

మియాపూర్: వరంగల్‌లో ఈనెల 28న జరుగనున్న ఏఐఎఫ్‌డీవై రాష్ట్రస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ మధుసూదన్ అన్నారు. సోమవారం మియాపూర్ స్టాలిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ప్రజలు అధికంగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

పారిశ్రామిక రంగంలో ఎనర్జీ-ఎఫిషియెన్సీ టెక్నాలజీ పెరగాలి

- సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్ : రవిచంద్రన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో ఎనర్జీ-ఎఫిషియెన్సీ టెక్నాలజీ మరింత పెరగాలని, ఉత్పాదకత పెంచడంతో పాటూ పర్యావరణంపై ప్రభావం లేని వస్తువుల తయారీకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శక్తి సమర్థవంతమైన పద్ధతులు అవలంభించాలని సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్, డాన్ ఫోస్ లిమిటెడ్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. పారిశ్రామికరంగంలో ఇంధన సమర్థత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సోమవారం మాదాపూర్‌లో వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కారక్రమంలో పాల్గొన్న రవిచంద్రన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో పోటీతత్వాన్ని కొనసాగిస్తూనే దీర్ఘకాలిక సుస్థిరతను పెంపొందించే భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. మెరుగైన ఇంధన సామర్థ్యం, వాతావరణ మార్పుల ఉపశమనం దిశగా పరిశ్రమలకు మార్గనిర్దేశం చేయడంలో బీఈఈ కీలక పాత్ర పోషిస్తుందిని బీఈఈ డైరెక్టర్ శ్యాంసుందర్ తెలిపారు. బీఈఈ, ఈఈఎస్ఎల్ సంయుక్తంగా రూపొందించిన డెమాన్ స్ట్రేషన్ ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (డీఏపీ) ప్రోగ్రామ్ బ్రోచర్ ఆవిష్కరించారు. నెట్ జీరో ఉద్గారాల దిశగా దేశంలో పురోగతిని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వ అధికారులు నిపుణులతో సహా 100 మందికి పైగా పరిశ్రమ వాటాదారులను ఈ వర్క్‌షాప్ ద్వారా ఒక్కచోటకు చేర్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓఆర్‌ఆర్ వరకు 100 ఫీట్ల రోడ్డును పునరుద్ధరించాలి

దుండిగల్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బాచుపల్లి రెడ్డి ల్యాబ్స్ నుంచి మల్లంపేట శివారు, ప్రణీత్ అంటీల మీదుగా పాత హైదరాబాద్ రోడ్డును పునఃరుద్ధరించాలని కోరారు. ఇప్పటికే ఆ రోడ్డు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి, 100 ఫీట్ల రోడ్డును పునరుద్ధరించాలని దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు ఎంబరి ఆంజనేయులు హెచ్‌ఎండీఏ అధికారులకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంభీపూర్ నుంచి మల్లంపేట మీదుగా బాచుపల్లి సర్కిల్ వరకు ప్రస్తుత రోడ్డు చిన్నది కావడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొనిడాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రణీత్ అంటీల మీదుగా ఓఆర్‌ఆర్ వరకు ఉన్న 100 ఫీట్ల రోడ్డును పునరుద్ధరించాలని ఆంజనేయులు అధికారులను కోరారు. ఓల్డ్ హైదరాబాద్ బాట రోడ్డును రెడ్డీస్ ల్యాబ్స్ నుంచి మల్లంపేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఏర్పాటు ప్రస్తుతం ఉన్న 40ఫీట్ల రోడ్డు కాకుండా, మ్యాప్‌లో ఉన్న 100 ఫీట్ల రోడ్డును నిర్మించి, మల్లంపేట కత్వ చెరువుమీదుగా రాకపోకలు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తున్న సీఐ నాగరాజు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపడం ఎంత ముఖ్యమో, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అంతే ముఖ్యమని, అందరికీ నిబంధనలు తెలిసుండాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లోని సెయింట్ ఆంథోని కాలేజీలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయొద్దని రాంగ్‌సైడ్, త్రిబుల్, ర్యాష్, నిర్లక్ష్యం డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెన్నెలగడ్డ చెరువులో నిర్మాణాలను కూల్చివేయాలి

- బీజేపీ నాయకులు ఆకుల సతీష్



ఉపకమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల వెన్నెలగడ్డ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మిస్తున్న నాలుగు అక్రమ నిర్మాణాలను తొలగించాలని, ఎన్‌ఓసీ లేకుండా నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. వెన్నెలచెరువు గ్రీన్‌పార్కుకాలనీని ఆనుకుని ఓబీఆర్‌ఎస్ నాయకుడు అక్రమంగా చెరువును కబ్జాచేసి నిర్మాణాలు సాగిస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతోనే అధికారులు అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారని పేర్కొన్నారు. 8 ఎకరాల చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోని ఇరిగేషన్ ఏఈ రామారావును తొలగించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని 9 చెరవులు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 4 చెరువులను పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. రోడ్లు సరిగా లేవని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. శానిటేషన్ కూడా అధ్వానంగా ఉందని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని తెపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వి.నర్సింహ, ఈఈ లక్ష్మీగణేష్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, టీపీఓ ప్రభావతి, డాక్టర్ అనిత పాల్గొన్నారు.